కోరిక

ఆచంట హైమవతి

చిన్ననాటి నుంచీ ఉన్న ఆ కోరిక అతనితో బాటే ఎదుగుతూ వస్తోంది. ఎవరినైనా బాగా గదురుకోవాలని, తప్పులుపట్టి... బుద్ధి చెప్పి బాగా సాధించాలనీ... వీలైతే చడా-మడా తిట్టేయాలనీ (పరుషంగా కాదు) పెద్దరికం వెలగపెట్టాలనీ ఒక విచిత్రమైన కోరిక శంకర మూర్తికి.

ఎవర్ని గదురుతాడు?! ఇద్దరు అన్నలు, ఒక అక్క, అమ్మ, నాన్న, బామ్మ, వదిన, బావ అందరూ తనకన్నా పెద్దవారే మరి!... మరి...?

అందరూ తనని ఒక కూచిలాగే చూస్తారు గాని... ప్చ్... తన అభిప్రాయం అడగరు, చెప్పినా కొన్నింటినైనా పాటించరు. తనవరకూ అసలు ఏ సమస్యారాదు... రానివ్వరు. ఇంట్లో ఏదైనా సమస్య వచ్చినా - వాళ్ళు చర్చించు కుంటూండగా తను కలిగించుకుని అడిగినా నాన్చేస్తారు. సరైన జవాబివ్వరు. పైగా "నీకెందు కొచ్చిన గొడవరా ఇదంతా? నీ మనస్సు పాడు చేసుకోకు. ఫ్రండ్స్‌తో సినిమాకి వెడతానన్నావు గా... వెళ్ళిరా. డబ్బుందా? కావాలా?" అంటూ మరిపించేసి అక్కడి నుంచి దాటిం చేస్తారు.

తనేమైనా తప్పుచేస్తే మాత్రం చిన్నన్నయ్య

అవకాశం దొరికింది కదా - అని పిలక... పిలక... ఓ మైగాడ్ పిలకలేదు కనుక సరి పోయింది గాని, ఉంటే అది పట్టుకుని వీళ్ళందరూ - వీళ్ళందరూ ఏమోగాని - పిలక ఝాడించినట్లు సాధించేస్తాడు.

పెద్దన్నయ్య మాత్రం ఏ తప్పు చేసినాసరే "పోనిద్దూ కుఱ్ఱవెధవ" అని "మ్చ్" అని చులాగ్గా తేల్చేస్తాడు. పెద్దన్నయ్యకి పిల్లల్లేకపోవడం కూడా అందుక్కారణమేమో! పెళ్ళై వచ్చిన దగ్గర్నుంచీ తన సంరక్షణంతా పెద్దవదినే చేసేది. తనని చాలా ప్రత్యేకతగాను, అపు రూపంగానూ చూసేది. ఇప్పటికీ అమ్మకన్నా కూడా గారాబంగా చూస్తుంది.

చిన్నన్నయ్య తనని లోకువచేసి సాధించినందుకు కోపం వస్తే - పెద్దన్నయ్య తనని మరీ కుఱ్ఱవెధవలాగ జమచేసి మాట్లాడతాడని కోపం వస్తుంది. ఈమధ్యవరకూ తను గ్రహించుకోలేకపోయాడుగాని, తనకి... పరస్పర విరుద్ధంగా ఉన్న ఈ రెండు విషయాలకీ కూడా ఎందుకు కోపం వస్తోందో? విచిత్రమే సుమా!" ఆశ్చర్యంగా అనుకున్నాడు శంకరమూర్తి.

తనకోపం చూసిన చిన్నవదిన కొంటెగా నవ్వుతుంది. మూసిననోట్లో కొంతగాలి చేర్చి, బుగ్గలు పూరించి పక్కలకి కదిపి పుక్కిలిస్తుంది. ఆమె తనకంటే ఏణ్ణార్థం చిన్నది. చిన్నన్నయ్య పెళ్ళిచూపులైనప్పుడు - తను కూడా వెళ్ళాడు. వధువు అందరికీ చాలా బాగా నచ్చింది.

"ప్రస్తుతం నేను పెళ్ళి చేసుకోదల్చుకోలేదు" బింకగా అన్నాడు చిన్నన్నయ్య.

చదువుకున్న అందమైన పిల్ల. సంప్రదాయకమైన కుటుంబం. పైగా... పూర్వం ఎరిగున్న కుటుంబానికి మిత్రులు కావటం కూడా కొంత కారణమైనా చక్కని సంబంధం కావటమే ముఖ్యకారణం. ఈ సంబంధం వదిలేయటం ఇంట్లో ఎవరికీ ఇష్టంలేదు. చిన్నన్నయ్య "ససేమిరా" అంటున్నాడు.

"నాకన్నా చిన్నదేగా! అన్నయ్య చేసుకోకుంటే పోన్లే! నేను... నేను... చేసుకుంటాను" అనుకున్నాడు. ఆ విషయమే పైకి చెప్పాడు ఆ రోజు. ఇంట్లో వచ్చిన దుమారం ఇంతా- అంతా కాదు. అందరూ వ్యంగ్యంగా మాట్లాడారు. చిన్నన్నయ్య అందరికంటే ఎక్కువగా దులిపి పారేశాడు.

ఉద్యోగం పర్మనెంట్ అయితే జీతం పెరుగుతుంది. అంతదాకా వాళ్ళాగితే నాదేం అభ్యంతరం లేదు. నేనిలా ఆలోచిస్తూంటే... ఇప్పుడిప్పుడే డిగ్రీ పూర్తిచేస్తున్న వెధవ్వి... అప్పుడే నీకు పెళ్ళికి అంత తొందరొచ్చిందిరా రాస్కెల్?!" అంటూ పూనకం వచ్చినట్లూగి పోయాడు. మీదమీదకొచ్చి కొట్టినంత పనిచేశాడు. అమ్మ అడ్డుకుని సముదాయించింది.

ఇవన్నీ చిద్విలాసంగా చూస్తున్న గృహస్తుగారు మాత్రం విషయాలు వివరిస్తూ "మరీ అర్జంటు లేకపోతే... పెళ్ళికి ఒక్క ఆరునెలలు మీరు ఎదురుచూడగలిగితే - నిశ్చయ తాంబూలాలు పుచ్చుకుందాం!" అంటూ కన్యాదాత గార్కి లేఖ వ్రాశారు. దాని అంగీకారంగా జాబు వచ్చింది.

మూతి వంకరగా తిప్పి, మీసం మెలేస్తూ సవాలు గెల్చినట్లు తనవైపు చూసి నవ్వాడు చిన్నన్నయ్య. నెలన్నర తర్వాతగాని నిశ్చితార్థానికి మంచి ముహూర్తంలేదు. ఈలోగా పట్టుదలతో రాత్రింబగళ్ళు పనిచేసి, మెప్పు పొందటం వల్ల "కష్టే-ఫలీ" అన్నమాట సార్థకమై నిశ్చితార్థంనాటికే ఉద్యోగం పర్మనెంటైంది వరుడు గార్కి. తరువాత నెలలో రెట్టింపు జీతం చేతికందింది. అందరూ 'అమ్మాయి అదృష్టవంతురాలు" అని పొగిడారు.



ఆరునెలలు ఆగక్కర్లేకుండానే రెండు నెలలు దాటకుండానే వాళ్ళ పెళ్ళైపోయింది. సునీత కాపురానికి వచ్చింది.

తనకన్నా చిన్నది కదా – అని ఆమెను గదరటానికి కుదరదుకదా? వదిన హోదాలో వచ్చి ఇంట్లో కూచుంది. ఏదో... పే...ద్ద దాని లాగ అన్నిటికీ తప్పులు పడుతుంది. తను కనిపెట్టిన ఆమె తప్పుల విషయం మాత్రం "పోవోయ్" అన్నట్లు చప్పరించేస్తుంది.

"పొగరుమోతు రాకాసి. పెడసరపు పెంకి వదిన" మొదలైన బిరుదులు తన అంతరంగంలోనే ఆమెకు ప్రసాదించి సన్మానిస్తూంటాడు. సునీత తనని వెక్కిరించి వేధించినప్పుడు కక్షగా ఇలాంటివే అనుకుంటూంటాడు.

మొదట్నుంచీ కొంటెతనంపాలు కొంచెం ఎక్కువే సునీతలో. చొరవ మరికాస్త ఎక్కువే. ఒక్కొక్కప్పుడు మోతాదు మరీ మీరుతూంటుంది కూడా! ఇంకా కాలేజీ వాతావరణపుగాలి దూరం కాలేదేమో ఆ పిల్ల ప్రవర్తన పెద్దవాళ్ళకి 'ఔరా' అనిపించక మానదు. పెద్దతరం వాళ్ళు "హాళ్ళూ–పెళ్ళూ మరీ ఎక్కువ ఈ పిల్లకి. కొంత దింపాల్సిందే నింపాదిగా!" అనుకొనే ప్రమాదం లేకపోలేదు. సరిపెట్టుకునే మనస్తత్వాలు గల కుటుంబం అవటంవల్ల "ఇంకా కుర్రతనం పోలేదు" అనుకుని ఇంట్లో అందరూ సర్దుకుపోతున్నారుగాని లేకపోతే కష్టమే! కాని శంకరమూర్తి మాత్రం "ఏమిటీవిడ గొప్ప?" అని చిరాకు. అందరిలా సరిపెట్టుకోలేకపోతున్నాడు.

"నిన్ను మూర్తి చేసుకుంటానన్నాడు తెలుసా? తక్కువ జీతం... అని నేను మొహమాట పడుతూంటే..." ఏదో మాటల సందర్భంలో అకస్మాత్తుగా చెప్పేసి నాలుక కొరుక్కున్నాడు.

సునీత భర్త ఎదురుగా మాత్రం ఆశ్చర్యంగా చూసి ఊరుకుంది. బిడియంగా అక్కడినుంచి వెళ్ళిపోయాడు శంకరమూర్తి. పుస్తకంలో తల దూర్చాడు. నిశ్శబ్దంగా అతనివెనకే వచ్చిన సునీత శంకరమూర్తి తలవెనకాల తేలిగ్గా ఒకదెబ్బ

కొట్టింది. "నువ్వు... నువ్వు... నన్ను... నన్ను చేసుకుందామనుకున్నావా?... హ్హా... నా చెవిదగ్గరకొస్తావ్...? ...!" ఎకసక్కెంగా అని, కిసుక్కున నవ్వింది.

"ఏంలేదు...నీకంటే నేను కొంచెం పొడుగే! నిజంగా నువ్వే బాగా పొడుగైనట్లు... ఊహూ... సంబరపడిపోకు" ఉక్రోషంగా అన్నాడు – శంకరమూర్తి. సునీత తనని అలా తలవెనకాల కొట్టడం చాలా అవమానకరంగా అన్పించింది. ఎవరూ చూడకపోయినా అమర్యాద ఫీలై మనస్సు ఉడికిపోవటం మొదలుపెట్టింది. ఆ కోపంలో అతని ముఖం, చెవులూ ఎఱ్ఱగా కంది పోయాయి. ముక్కుపుటాలు వేడిగాలితో అదర సాగాయి.

ఆ క్షణంలో ఎవరితోనైనా చెప్పి ఉపశమనం పొందాలని తీవ్రంగా అన్పించింది కాని... కొంచెం ఆలోచించిన తరువాత "అతి సామాన్య విషయం ఇది. సీరియస్‌గా తీసుకోకు" అంటారు. "ఆ పిల్ల చిలిపితనం నీకు తెలుసుకదా! కొత్తగా విలువిస్తావెందుకు?" అంటారు. "సునీత చెప్పింది నిజమే! సునీత కంటే నువ్వు ఒక అంగుళం పొడుగైనా పొట్టిగానే కన్పిస్తావ్!" అని కూడా అనేయగలరు. అందుకే "ఎవరికీ చెప్పద్దులే!" అనుకున్నాడు తనలో శంకరమూర్తి.

"ఛీ... ఏమిటింత లోకువ కట్టేసింది తనని?" ఇంకానయం... ఆ మహాతల్లినే చేసుకున్నానుగాదు! తను చిన్నగా కన్పించి ఇంకెంత హీనంగా చూసేదో... పెళ్ళి జరిగిఉండక పోనులే... తనేదో కుఱ్ఱతనం వల్ల ఈవిడగారి అందం చూసి అలా అనుకున్నాడుగాని... ఇంట్లో పెద్దవాళ్ళకి తెలియదేమిటి? పెద్దవాళ్ళు – పెద్దవాళ్ళే! అందుకే తనకోరిక ఆటకోటి తనంగా తేల్చేశారు" అనుకుని తేలిగ్గా నిట్టూర్చాడు శంకరమూర్తి. సునీతతో మాట్లాడడం తగ్గించి గంభీరంగా ఉండడం మొదలు పెట్టాడు.

రకరకాల వ్యాయామాలు చాలా దీక్షగా సాధన చేయడం మొదలెట్టాడు. మరికొంత పొడువు కాగలిగాడు. శరీరం కూడా బాగాదృఢంగా తయారైంది. దరహాసమిళిత స్ఫురద్రూపంతో ఆకర్షణీయంగా తయారయ్యాడు శంకరమూర్తి.

ఎమ్.కామ్. పాసై, సి.ఏ పూర్తి చేసి చార్టెడ్ అక్కౌంటెంట్‌గా రెండు చేతులా ఆర్జిస్తున్నాడు శంకరమూర్తి. ఒక మనిషిగా నిలబడగల సామర్థ్యం సంపాదించుకోగలిగాడు గానీ అతని అసంతృప్తి మాత్రం పోలేదు.

చిన్ననాటి నుంచీ ఉన్న అలవాటు వల్ల తలవంచుకుని తనపని తాను చేసుకుపోవటమే గానీ ఇంకొకరి జోలికి వెళ్ళడు. అతని పనిలో తప్పులు లేకుండా చూసుకొనేసరికే అతనికి గగనమై పోతోంది. తన తప్పుల్లేకుండా చూసుకుని గదా ఇంకొకరిని తప్పుపట్టాలి? అవతని వాళ్ళ తప్పు కన్పిస్తేగదా తిట్టటానికి అవకాశం దొరుకుతుంది? ఇంత చక్కని మనస్తత్వంగల శంకరమూర్తికి ఆ చిన్న అసంతృప్తి కొండంతలై అతడిలో తిష్టవేసి పీడిస్తూంటుంది తరచూ వింతగా.

శంకరమూర్తికి పెళ్ళి కుదిరింది. సుముహూర్త నిర్ణయం కూడా అయింది. స్నిగ్ధ సుకుమారమైన 'వినయ' శంకరమూర్తి మనస్సుని పూర్తిగా ఆకట్టుకుంది. పూర్వం సునీత విషయంలో అనుకున్నంత ఆత్రంగా లేదు.

తొందరపడకుండా బాగా ఆలోచించి తన అంగీకారం తెలిపాడు. అతని ఎన్నిక అందరికీ నచ్చింది.

అడుగడుగునా మరదలు, బావమరిది

చేసిన కొంటెపనులకి తెలివిగా తప్పించుకుని మళ్ళీ వాటిని వాళ్ళకే ఎదురుతిప్పి అందర్నీ ఆశ్చర్యపరచాడు. వినయ కళ్ళల్లో "మరేమిటను కున్నారు?... నా విభుడంటే!" అనే గర్వంతో కూడిన తృప్తిని చూసి శంకరమూర్తికి ఆనందం కలిగింది. "ఈమె నా ఆజ్ఞ, నా అంగీకారాల తోనే కదా నడుచుకోవాలి... అంటే నాకు లోబడే కదా ఉండాలి?! అబ్బ ఇన్నాళ్ళకి గదా నాకు అనుకూలమైన కాలం సమకూరింది?" అనే ఆలోచనలో మునిగి, ఆ ఆనందంలో తేలుతూ వధూవరులచేత ఆడిస్తున్న 'సరి-బేసి' ఆటలో ఇరవై రూపాయలు కోల్పోయాడు.

ఒకేసారి అందరూ ఘొల్లున నవ్వేసి చప్పట్లు చరిచేసరికి ఈలోకంలోకొచ్చి పడ్డాడు - శంకరమూర్తి.

నవదంపతులకి నిరాశగా ఆషాఢమాసం, హడావిడులతో శ్రావణమాసం నోములూ పూర్త య్యాయి. వినయని కాపురానికి తీసు కొచ్చారు. వినయతో ఏదైనా కొంచెం గట్టిగా మాట్లాడి తే... ఇంట్లో పెద్దవాళ్ళందరూ పరు గెత్తుకొచ్చేసి "ఏమైందిరా చంటీ" అంటూ పరామర్శలు మొదలు.

ఎంత ఆలోచించినా వేరింటి కాపురానికి పెద్దవాళ్ళు ఒప్పుకుంటారని నమ్మకం కుదర లేదు శంకరమూర్తికి. "అది బాగుండదు కూడా! తను అంత స్వలాభపరుడు కాడు. మరి ...? మరొక ఊరిలో ఉద్యోగమైతే...!" అంతే. అదే నెరవేరబోతోంది. చెన్నైలో కాపురం పెట్టడానికి చక్కని అవకాశం వెతుక్కుంటూ వచ్చింది.

శంకరమూర్తి ప్రాణ స్నేహితుడు చెన్నైలో ప్రాక్టీస్ చేస్తున్నాడు. అతడికి అమెరికాలో చదువుకి అవకాశం వచ్చింది. అది పద్దెనిమిది నెలల కోర్సు. అతడు వెనక్కి తిరిగి వచ్చేలోగా ప్రాక్టీస్ పడిపోకుండా ఆ పద్దెనిమిది నెలలు తన పని చూసిపెట్టమని శంకరమూర్తిని కోరాడు.

అంతే! ఎగిరి గంతేశాడు శంకరమూర్తి. మొదట్లో ఒప్పుకోకపోయినా చివరకి ఇంట్లో అందరినీ ఒప్పించగలిగాడు. పెద్దవాళ్ళొచ్చి కొత్త సంసారం పెట్టించి వెళ్ళారు.

ఇక శంకరమూర్తి స్వాతంత్ర్యం సంపూర్ణం గా సిద్ధింపజేసుకోవాలి.

వెంటనే మొదలెడితే "పురుట్లోనే సంధికొట్టి నట్లు"... బాగుండదు కదా! మొదటి వారం రోజులూ హాయిగా ఊరంతా తిరిగి, బయటే భోజనం చేసి సరదాగా గడిపేశారు.

బట్టలు ఇలాగా సర్దటం? కూరలో ఇంత ఉప్పు తగలేశావేమిటి? ఇది ఇస్త్రీ చేసిన షర్ట్ అంటే ఎవరైనా నమ్ముతారా... ఇన్ని ముడ తలతో... చేసేవన్నీ తప్పులు... పశ్చాత్తాపమ న్నదే కన్పించదేం నీలో?" ఇలా రోజుకొక తప్పు పట్టి, విసుక్కుని గదిరేస్తున్నాడు శంకర మూర్తి.

అలా గదరగానే "అమ్మయ్య! బలేగా గదిరే శాను" అనుకొని నిట్టూరుస్తున్నాడు. అదేదో బాధ్యత తీరినట్లు ఫీలవుతున్నాడు. "తప్పులు పట్టగలుగుతున్నాను గదా! అనుకుంటూంటే పట్టరానంత సంతృప్తిగా ఉంది" అనుకుని స్థిమిత పడుతున్నాడు కూడాను.

ఈమధ్య వినయని తిట్టటానికి కుదరటమే లేదు. అన్నీ చాలా శ్రద్ధగా చేస్తోంది. నోట్లో మాట నోట్లో ఉండగానే జరిగిపోతోంది. ఫ్రీగా తిట్టటం అలవాటైన శంకరమూర్తికి తిట్టక పోవటం వెల్తిగా అన్పిస్తోంది.

"తప్పించుకుంటున్నానని మురిసిపోకు. ఇవేళ కాబోతే రేపు - దొరుకుతావు. నువ్వు నాచేత తిట్లు తినటానికే పుట్టావు తెలిసిందా?" సవాలు పూర్తి చేస్తూ "ఇది సరికొత్త సాధింపు. బలే బాగుందే" అనుకుంటూ ఉత్సాహంగా మన

స్సులోనే నవ్వుకున్నాడు శంకరమూర్తి.

కళ్ళనిండా నీటితో గుటకలు మింగుతూ వంటింట్లోకి వెళ్ళిపోయింది వినయ. ఆమె కన్నీరు చూసిన శంకరమూర్తి మనస్సు కొంచెం గా మెత్తపడింది. "ఇవేల్టి ఈ గొడవ అనవసర మేమో సుమా!" అన్పించింది.

తప్పు చేస్తే తిట్లు తప్పవు. సరే! తప్పులు చెయ్యకపోవటమే ఒక పె...ద్ద.... తప్పుగా భావిస్తే గత్యంతరం??? భర్త మనస్తత్వాన్ని గురించిన ఆలోచనలతో అన్యమనస్కంగా పనులు చేస్తోంది వినయ.

ఆ పరాకులో ఖరీదైన తెల్లచొక్కాని, రక రకాల రంగుల బట్టలతో కలిపి నానేసి ఉతికే సింది వినయ. ఆ చొక్కా ఎంతగా పాడవటానికి అవకాశం ఉందో... అంతా పాడయింది.

వినయ భయపడినట్లే శంకరమూర్తి ఉగ్రు డైపోయాడు.

వినయని చడా-మడా తిట్టేశాడు. అతడికి చాలా ఇష్టమైన ఆ షర్ట్ స్థితి చూసేసరికి నిజం గానే బాగా కోపం వచ్చింది అతడికి. ఆ రౌద్రం చాలాసేపటివరకూ తగ్గలేదు. అతని తిట్లు భరిస్తూ వినయ "సార్థక నామధేయుడు" అను కుంది. అతడి కోపం ఎలా తగ్గించాలో బోధపడ లేదామెకు.

అతడి భీకరకోపానికి బిక్కచచ్చిపోయి ఏడుస్తూండిపోయింది వినయ. భర్త కోపం తల్చుకుని-తల్చుకుని బాధపడుతోంది వినయ. ఓదార్చే ప్రయత్నం కూడా చేయలేదు శంకర మూర్తి. ఏడ్చి, ఏడ్చి ఆ రాత్రి తొమ్మిదయేసరికి విపరీతమైన జ్వరం వచ్చేసిందామెకు. ఉలికి - ఉలికి పడడం, కళ్ళు పెద్దగా చేసి భయంగా చూడటం, ఏవేవో కలవరింతలు, హైరానతో బాగా రొప్పుతోంది.

అర్ధరాత్రి దాటేసరికి వినయ జ్వరం మరింత పెరిగింది. ఆ పరిస్థితి చూసి హడలి పోయాడు శంకరమూర్తి. నిజంగానే శంకర మూర్తి సార్థకనామధేయుడు. మాయామర్మాలెరుగడు. పొగిడితే ఉబ్బిపోతాడు. తేడావస్తే క్రుంగి పోతాడు.

గాబరాపడ్తూ పరుగెత్తుకెళ్ళి డాక్టరుని తీసుకొచ్చాడు. వినయ కలవరింతలు చూసిన డాక్టరు "ఆడవాళ్ళని ఎంత సున్నితంగా చూసు కోవాలో" వివరంగా సుత్తికొట్టాడు. అవన్నీ శంకరమూర్తికి తెలియనివా? "... కాని ... ఏమిటో... ఇలా..."

ఆ రాత్రంతా మందులిస్తూ శుశ్రూష చేశా డు. తెల్లవారు ఝామున జ్వరం దిగజారి జరిగి నది జ్ఞాపకం తెచ్చుకుంది వినయ. ఎదర కుర్చీ లో తూలుతూ కూర్చున్న భర్తను చూసి ఆశ్చర్య పోయింది. ఆనంద పడింది - కూడా! అతడిని - తట్టిలేపి మంచమ్మీద పడుకోమంది.

వాడిన గులాబీలా నీరసంగా ఉన్న వినయ ని చూసి "ఈ బాధకి కారణం నేను" అనుకున్న అతని మనస్సు ఆర్ద్రమైంది. ఆత్రంగా ఆమెను అక్కున చేర్చుకున్నాడు. వినయ వెచ్చని కన్నీరు అతడి గుండెని తడిపింది. గువ్వలా అతని బాహువుల్లో ఒదిగి కరిగిపోయింది వినయ.

"నిన్నుకాక నేనింకెవర్ని తిట్టగలనే? మా ఇంట్లో అందరూ నాకన్నా... పెద్దవాళ్ళే! నీమీద నా అధికారం ప్రదర్శిద్దామని నేనేదో తిడితే మాత్రం... నువ్వింత బాధపడి ఏడ్చి జ్వరం తెచ్చుకుంటావా? నీకేదైనా అయితే... నేనేమై పోవాలే... నువ్వు... నువ్వు లేకుండా... నేను... నేను"

నన్నపురూపంగా చూసేవాళ్ళెందరున్నా నా స్వంతానివి, నా ప్రాణం, నా సర్వస్వం నువ్వే కదే!" అతని గొంతు గద్గదికమైంది. ఎంత ఆపు కున్నా అతనికివ్వాడా కన్నీరాగలేదు.



నా మనసు అర్థం అయేలా చెప్పలేక పోతున్నాను విన్నూ...! ఎలా చెప్పను? ఏమని చెప్పను...?

భర్తని చూస్తూ అతని ఆక్రోశం వింటున్న వినయకి శంకరమూర్తిలో ఏనాటి నుంచో బలపడి నిలిచిపోయిన వెల్తి పూడుతున్న భావం అవగతమైంది. ఆమె మానసాకాశంలో ఒక తటిల్లత మెరిసింది. తలపై నున్న పెద్ద బరువు దించేసిన భావం కలిగి తేలిగ్గా నిట్టూర్చిందామె.

"ఇది కఠిన సమస్య కానే కాదు. అతి చిన్నది కాని... సున్నితమైన విషయం. ఓర్పే విజయానికి ముఖ్యసూత్రం" అనుకుంది తనలోనే వినయ.

అర్థం లేని ప్రశ్న అయితే జవాబుండదు గాని... ఇప్పుడు ప్రశ్న అర్థం అయింది. దానికి జవాబు నాకు తెలుసు. సమస్యా చిన్నదే... పరిష్కారం సులభసాధ్యమే!

"అర్థమైంది" గుసగుసగా అంది వినయ శంకరమూర్తితో.

"థ్యాంక్స్...!" ఆమె పెదవులు చుంబించాడతను.

కార్యక్రమం పూర్తయి వాళ్ళకి కునుకు పట్టే లోగా పాలకుఱ్ఱాడొచ్చి తలుపు తట్టాడు.

ఆ తరువాత శంకరమూర్తి కోపానికి ఏనాడూ బాధపడలేదు వినయ. ఇష్టంగానే భరిస్తుంది. భర్తని పొగుడుతుంది. అభిమానిస్తుంది.

అతడి కోపానికి మనస్సులో నవ్వుకునేది. పైకి మాత్రం భయభక్తులు చూపించేది. చెన్నై నుంచి స్వంత ఊరు వెళ్ళాకకూడా అతడి గౌరవం కాపాడుతూనే తన మనసులో కోరికలు తీర్చుకుని లాభమే పొందుతోంది.

"ఆయన సర్వస్వం నేనే అయినప్పుడు, నా మాట ఆయన జవదాటనప్పుడు ఇంక నాకు కొదవేమిటి?" ఈ పాయింట్ చాలా తృప్తి నిచ్చిందామెకు.

అందరి దృష్టిలోనూ శంకరమూర్తి కోపదారి మనిషి, వినయ "సార్థకనామధేయ"... అంతే గదా మరి? - ! ●